క్లుప్తంగా

ఉగాదికి వసంత గానామృతం

ఒంగోలు మెట్రో: ఆలిండియా కళా రంగం, పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి సంగీత నృత్య కళా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది పండుగ సందర్భంగా ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్ ఆవరణలో వసంత గానామృతం సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. కళాకారులు, కళాభిమానులు, కళాపోషకులు పాల్గొని జయప్రదం చేయాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమ కరపత్రాలను స్థానిక సత్యనారాయణపురం దిబ్బలరోడ్డులోని అనంత కోదండ రామస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం ఆవిష్కరించగా, పలువురు కళాకారులు పాల్గొన్నారు.

9న ఉగాది కవి సమ్మేళనం

ఒంగోలు మెట్రో : ఎర్రన సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద గల ఎర్రనమాత్యుల విగ్రహం వద్ద క్రోధి నామ తెలుగు సంవత్సర ఉగాది కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్ తెలిపారు. పలువురు కవులు పాల్గొని ఎర్రనకు పుష్పాంజలి ఘటించి కవితలు వినిపిస్తారన్నారు. ప్రధానంగా షడ్రుచుల పేరిట, ఆరు ఋతువుల వర్ణన, వివిధ సామాజిక అంశాల గురించి కవితలు వినిపిస్తారు. సాహిత్యాభిమానులు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు మైనంపాటి సాయి తెలిపారు.

ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో...

ఒంగోలు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను స్థానిక రంగారాయుడు చెరువు వద్ద గల శుభప్రదం కమ్యూనిటీ భవనంలో ఈ నెల 9వ తేదీ నిర్వహించనున్నట్లు ఉపాధ్యక్షుడు మహంకాళి శేషయ్య, కార్యదర్శి గంజాం రంగనాథ్ తెలిపారు. ఒంగోలు ప్రముఖ పురోహితులు బ్రహ్మశ్రీ నేలబొట్ల సదాశివశాస్త్రిచే సాయంత్రం ఆరు గంటలకు క్రోధి నామ పంచాంగ శ్రవణం, బ్రాహ్మణ వయో వృద్ధ దంపతులకు బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో చిరు సన్మానం నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు తెలిపారు. ప్రజలు పాల్గొని పంచాంగ శ్రవణం విని వృద్ధ బ్రాహ్మణుల దంపతుల ఆశీస్సులు అందుకోవాలని కోరారు.

ఓటర్లకు అవగాహన కల్పించేందుకు ఫ్లాష్ మాబ్



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న స్వీప్ బృందం

ఒంగోలు అర్బన్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లకు అవగాహన కల్పించే ఉద్దేశంతో స్వీప్ బృందం ఆదివారం స్థానిక గాంధీ పార్కులో పేస్ కళాశాల విద్యార్థులతో ఫ్లాష్ మాబ్ (నృత్య) కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పార్కులో ఉన్న ఎల్ఈడీ స్క్రీన్‌పై జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సందేశాన్ని చూపారు. కార్యక్రమంలో ఒంగోలు రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ సుబ్బారెడ్డి, స్వీప్ నోడల్ అధికారి బి.రవికుమార్, జ్యోతి, వెంకటేశ్వర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిలియంట్ కంప్యూటర్స్ వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న బ్రిలియంట్ కంప్యూటర్స్ అధినేత న్యామతుల్లాబాషా, తదితరులు

ఒంగోలు: స్థానిక అంజయ్యరోడ్డులోని బ్రిలియంట్ కంప్యూటర్స్ ప్రధాన కార్యాలయంలో ఆదివారం 29వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ షేక్ న్యామతుల్లాబాషా, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ తాహూరా భారీ కేక్ కట్ చేసి ఉత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు, డైరెక్టర్ అఖిల్, టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

391 మద్యం బాటిళ్లు పట్టివేత



పట్టుకున్న మద్యం బాటిళ్లతో పోలీసులు

బేస్తవారిపేట: మండలంలోని కొత్తపేట సమీపంలో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను ఆదివారం బేస్తవారిపేట పోలీసులు పట్టుకున్నారు. పీవీ పురంకు చెందిన ఒకరు ఆటోలో 391 క్వార్టర్ బాటిళ్లు, 48 బీరు బాటిళ్లు తీసుకెళ్తుండగా, పోలీసులు తనిఖీ చేసి స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, ఇతర ప్రలోభ వస్తువుల సరఫరాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నట్లు కంభం సీఐ రామకోటయ్య తెలిపారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ జయరావు, పోలీసులు పాల్గొన్నారు.



ఒంగోలు గద్దలగుంట నుంచి బయలుదేరుతున్న కార్పొరేటర్ తాడి కృష్ణలత, నాయకులు



కొత్తపట్నం మండలం నుంచి తరలివెళ్తున్న కార్యకర్తలు



ఒంగోలు 48వ డివిజన్ నుంచి బయలుదేరుతున్న నాయకులు, కార్యకర్తలు

పయనం.. మేమంతా సిద్ధం..!

- ఒంగోలు, సంతనూతలపాడు నియోజక వర్గాల నుంచి సీఎం బస్సు యాత్రకు భారీగా తరలిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- ప్రత్యేక బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో వెళ్లిన నాయకులు, కార్యకర్తలు

ఒంగోలు: మేమంతా సిద్ధం పేరుతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న బస్సు యాత్ర జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివెళ్లారు. ఒంగోలు నగరం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సులు, కార్లు, ఇతర వాహనాల్లో పొదిలి సమీపంలో ఏర్పాటు చేసిన సీఎం బహిరంగా సభకు చేరుకున్నారు. బస్సు యాత్రలో సైతం పాల్గొని ఉత్సాహంగా కదంతొక్కారు. నగరంలోని ప్రతి డివిజన్ నుంచి వేసవి ఎండలను సైతం లెక్కచేయకుండా పెద్ద ఎత్తున సభకు వెళ్లారు. వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, వివిధ కమిటీల నాయకుల ఆధ్వర్యంలో ప్రజలు, అభిమానులు బయలుదేరి వెళ్లారు.

కొత్తపట్నం మండలం నుంచి...

కొత్తపట్నం: పొదిలి దగ్గర సీఎం సభకు కొత్తపట్నం మండల ప్రజలు భారీగా తరలివెళ్లారు. మండలంలోని 15 పంచాయతీల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వృద్ధులు, యువకులు, మహిళలు తరలివెళ్లారు. మేమంతా సిద్ధం అంటూ నినాదాలు చేసుకుంటూ వెళ్లారు.



ఒంగోలు 9వ డివిజన్ నుంచి తరలివెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆదివారం సెలవు కావడంతో ఎక్కువ మంది బయలుదేరి వెళ్లారు. వారికి అవసరమైన ఏర్పాట్లను నాయకులు చేశారు.

చీమకుర్తి మండలం నుంచి...

చీమకుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభకు చీమకుర్తి నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి భారీ సంఖ్యలో బస్సులు, కార్లు, ఆటోల్లో వందలాది మంది కార్యకర్తలు పార్టీ జెండాలతో ఉత్సాహంగా వెళ్లారు. తరలివెళ్లిన వారిలో మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు ఉన్నారు.

మద్దిపాడు మండలం నుంచి...

మద్దిపాడు: మండలంలోని ప్రతి గ్రామం నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం సభకు తరలివెళ్లారు. పార్టీ మండల నాయకులు ఆనందోత్సాహాలతో అభిమానులను తీసుకునివెళ్లారు. తమకు ఐదేళ్ల పాటు సంక్షేమ పథకాలు అందించి ఆర్థికంగా మేలు చేసి జీవితాలను మార్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు చెప్పడానికి వెళ్తున్నట్లు పలువురు అభిమానులు ఆనందంగా తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, నాయకులు మోరబోయిన సంజీవరావు, తదితరుల ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో మేమంతా సిద్ధం సభకు తరలివెళ్లారు.



చీమకుర్తి నుంచి వెళ్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు



ఒంగోలు 17వ డివిజన్ నుంచి మేమంతా సిద్ధం సభకు బయలుదేరుతున్న నాయకులు, ప్రజలు

ఘనంగా క్రోధి నామ ఉగాది కవి సమ్మేళనం



సన్మాన పత్రాలు అందుకున్న కవులు

ఒంగోలు మెట్రో: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం స్థానిక ఒంగోలు రాజాపానగల్ రోడ్డులోని గౌతమ్ మోడల్ స్కూల్ ఆవరణలో కవి సమ్మేళనం నిర్వహించారు. కళామిత్రమండలి (తెలుగు లోగిలి), నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం సంయుక్త నిర్వహణలో ఉభయ సంస్థల అధ్యక్షులు డాక్టర్ నూనె అంకమ్మరావు, నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఈ ఉగాది మన అందరి జీవితాలలో వెలుగులు నింపాలని, రేపటి తరాన్ని జాగృతం చేయాలని ఆకాంక్షించారు. ముఖ్య అతిథిగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ హాజరై మాట్లాడారు. సీనియర్ పాత్రికేయుడు నాగేశ్వరరావును సత్కరించారు. ముందుగా కప్పగంతు జయరామయ్య పంచాంగ శ్రవణం చేశారు. గౌతమ్ మోడల్ విద్యా సంస్థల చైర్మన్ మేకల కొండయ్య, కృష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, నాగినేని నరసింహారావు, మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు పాల్గొని కవులకు, ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గాడేపల్లి దివాకర్ దత్తు, డి.వి.యం.సత్యనారాయణ, యం.సూర్యకుమారి, యు.వి.రత్నం, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరిగింది. పి.వి.సురేష్, ఓరుగంటి ప్రసాద్, యువ కవయిత్రి బీరం అరుణ తదితరులు నిర్వహణ సహకారం అందించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన కవులందరినీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

రైజ్ కాలేజీలో ఘనంగా ఫేర్‌వెల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న విద్యార్థులు, సిబ్బంది

ఒంగోలు: స్థానిక రైజ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఫేర్‌వెల్ వేడుకలను ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. కృష్ణసాయి ప్రకాశం కాలేజీ ట్రిపుల్ ఈ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాన్ని ప్రారంభించారు. కాలేజీ కరస్పాండెంట్ శిద్దా హనుమంతరావు, డైరెక్టర్ ఏవీ భాస్కరరావు, గౌరవ చైర్మన్ ఇస్కాల చిన రంగమన్నార్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ జె.కృష్ణ, ట్రిపుల్ ఈ విభాగం అధిపతి డాక్టర్ రుషి సంతోష్,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటాలి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రతిభ చాటి జీవితంలో ఉన్నత స్థితికి చేరాలని వక్తలు కోరారు. స్థానిక అపెక్స్ స్కూల్లో ఎంఎస్ గ్రాండ్‌లో ఆదివారం మల్టీ టాలెంట్ షో నిర్వహించారు. ప్రైమరీ, హైస్కూల్, కిండర్ గార్డెన్ విద్యార్థులు పలు విభాగాలలో ప్రతిభ చాటారు. మార్షల్ ఆర్ట్స్ సైతం విద్యార్థులు ప్రదర్శించారు. కరస్పాండెంట్ శివకోటి రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీఎంఆర్, అర్జున్ ఇన్‌ఫ్రా అధినేత అర్జున్, ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విష్ణు, యూఎస్ కన్సల్టెన్సీ అధినేత బాబా సాయి, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.జ్యోత్స్న, సోషల్ రిఫార్మర్ అరుణ, ఆకృతి అకాడమీ డైరెక్టర్ రామాంజనేయులు, ప్రిన్సిపాల్ జ్యోతి, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అతిథులు

ఆసక్తిగా సాగిన అండర్-17 చెస్ పోటీలు

ఒంగోలు సెంట్రల్: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో అండర్-17 బాలబాలికలకు ప్రకాశం జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పోటీలు నిర్వహించారు. బాలుర విభాగంలో వెంకట దినేష్ కొల్లబోయిన, కాపా నితిన్, బాలికల విభాగంలో వేద శ్రీ కొల్లా, వైష్ణవి.ఎస్ ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. వీరు ఈ నెల 20, 21 తేదీల్లో విజయవాడలో నిర్వహించే అండర్-17 2024 చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా చెస్ అసోసియేషన్ సెక్రటరీ షేక్ అబ్దుల్‌నబీ తెలిపారు. విజేతలకు నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.సుబ్రహ్మణ్యేశ్వరరావు బహుమతులు అందించారు. టోర్నమెంట్ ఆర్బిటర్‌గా సుకాంత్ వ్యవహరించారు.



విజేతలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, చెస్ అసోసియేషన్ ప్రతినిధులు

వాహనాల తనిఖీ

మార్టూరు: ఎటువంటి రశీదులు, బిల్లులు లేకుండా బంగారు, వెండి ఆభరణాలు తరలిస్తున్న ఓవ్యక్తి నుంచి ఆదివారం సాయంత్రం మార్టూరు పోలీసులు 80 గ్రాములు బంగారం, 2 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏఎస్సై సైదా వివరాల మేరకు.. మండలంలోని వలపర్ల గ్రామానికి చెందిన బంగారు వ్యాపారి కొల్లిపర సుపేరావు బైకును పోలీసు స్టేషన్ ముందు సీఐ ఎస్వీ రాజశేఖర్ రెడ్డి సోదా చేశారు. ఎటువంటి బిల్లులు, రశీదులు చూపలేక పోవడంతో ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆరోగ్యంగా జీవించడమే దేశభక్తి



కార్యక్రమంలో పాల్గొన్న గ్రంథాలయ పాఠకులు

ఒంగోలు టౌన్: ఆరోగ్యంగా, సంతోషంగా జీవించడమే దేశభక్తికి నిదర్శనమని ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అన్నారు. చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈసురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్ అని గురజాడ అన్న మాటలను గుర్తు చేశారు. ఒత్తిడి, ఆందోళన నుంచి బయటపడేందుకు ప్రతిరోజూ కనీసం ఒక గంట సేపు వ్యాయమాలు చేస్తే మంచిదన్నారు. చిన్నారులు పాఠశాల వయసులోనే ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించేలా తీర్చిదిద్దాలన్నారు. పుస్తకాలు చదవడం లాంటి మంచి అలవాట్లు కూడా ఆరోగ్యాన్ని స్తాయని చెప్పారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మన చుట్టూ నివసిస్తున్న ప్రజల ఆరోగ్యాన్ని కూడా కాపాడినవారిమి అవుతామని సామాజిక కార్యకర్త నున్నా ఆంజనేయులు చెప్పారు. ఈ సందర్భంగా పిల్లలకు నీతి కథలు బోధించారు. కార్యక్రమంలో విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, ఎం.శివకుమారి, ఎస్.అనిల్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సు కిందపడి ఇద్దరికి తీవ్ర గాయాలు

పామూరు: ప్రమాదవశాత్తు బస్సు కిందపడి ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం పామూరులోని నెల్లూరురోడ్డులో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కనిగిరి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు చెన్నైకు వెళ్తోంది. ఈ సమయంలో స్థానిక నెల్లూరురోడ్డులో పామూరుకు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు మార్జిన్ దిగి బస్సును క్రాస్‌చేసి తిరిగి రోడ్డు మార్జిన్ నుండి బైక్‌ను రోడ్డుమీదకు ఎక్కించబోగా బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఘటనలో వినుకొండ సుజయ్‌కు తలకు తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా సంగబోయిన వెంకట దినేష్‌కు నడుములు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ప్రథమ చికిత్స అనంతరం సుజయ్‌ను నెల్లూరులోని ప్రైవేట్ వైద్యశాలకు, వెంకట దినేష్‌ను ఒంగోలులోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతున్నారు

నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర పోలీస్ బలగాలు, ఒంగోలు తాలూకా పోలీసులు

- ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఫ్లాగ్ మార్చ్

ఒంగోలు సబర్బన్: ప్రజలంతా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కేంద్ర పోలీసు బలగాలు ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఒంగోలు తాలూకా పోలీసులతో కలిసి పీర్లమాన్యం, అరుణోదయకాలనీ, పేర్నమిట్ట ప్రాంతాల్లోని ప్రతి వీధిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించగా, కేంద్ర పోలీస్ బలగాలతో (బీఎస్ఎఫ్) తాలూకా సీఐ కే భక్తవత్సలరెడ్డి, ఎస్సై, సిబ్బంది పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తూ వారిలో ధైర్యాన్ని నింపే విధంగా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ప్రజలకు ఎన్నికలపై అవగాహన కల్పించారు. ఎన్నికలు సజావుగా, సాఫీగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటుందని ప్రజలకు వెల్లడించారు.

బీజేపీకి వంతపాడుతున్న టీడీపీని ఓడించండి



సమావేశంలో ప్రసంగిస్తున్న కిలారి పెద్దబ్బాయి

- ఏపీ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘ రాష్ట్ర కార్యదర్శి పెద్దబ్బాయి

ఒంగోలు టౌన్: దేశ సంపదను దోచుకుంటూ ప్రజల మధ్య మతచిచ్చు రాజేస్తున్న బీజేపీకి వంతపాడుతున్న టీడీపీ, జనసేన పార్టీలను రాష్ట్రంలో చిత్తుగా ఓడించాలని ఏపీ గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి పిలుపునిచ్చారు. స్థానిక ఎల్బీజీ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండే బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో ఇంటి పన్ను, చెత్తపన్ను, గ్యాస్ ధరల పెంపు పాపాలన్నీ కేంద్రంలో అధికారం చెలాయిస్తున్న బీజేపీవే అని అన్నారు. బీజేపీతో జతకట్టిన టీడీపీ, జనసేన పార్టీలకు ఈ పాపంలో భాగస్వామ్యం ఉందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వకుండా, రాష్ట్రాభివృద్ధి కోసం ఎలాంటి నిధులు మంజూరు చేయకుండా తీరని ద్రోహం చేసిన బీజేపీ కూటమి దొంగనాటకాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. పశు నష్ట పరిహారం పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని సంఘ జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.శివయ్య, ఎన్.గంగరాజు, కె.జయరాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కవి సమ్మేళనం



ట్రస్టు ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాలు అందుకున్న పలువురు ప్రముఖులు

చీరాల అర్బన్: బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో నిష్ణాతులైన 9 మందికి బత్తుల సర్వీస్ ట్రస్టు ఆధ్వర్యంలో పురస్కారాలు అందించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా న్యాయవాది బండారుపల్లి హేమంత్‌కుమార్ హాజరై మాట్లాడుతూ సన్మాన గ్రహీతలపై ఇంకా బాధ్యత పెరిగిందన్నారు. సభా నిర్వహణను ప్రముఖ కవి బీరం సుందరరావు నిర్వహించగా విశిష్ట అతిథులుగా డాక్టర్ ఐ.బాబూరావు, ఐ.సుభాషిణీ, భాగి కృష్ణమూర్తి, కోడూరి ఏకాంబరేశ్వరబాబు, డాక్టర్ సుభాషిణి, డాక్టర్ బోళ్ల లక్ష్మీభవానిలు పాల్గొన్నారు. అనంతరం వివిధ రంగాల్లో నిష్ణాతులైన కోన రమణరావు, డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, వంగర శ్రీధర్, కొసనం నాగమాంబ, సజ్జా వెంకటేశ్వర్లు, గాదె హరిహరరావు, ఆవుల దయాకరరెడ్డి, మంత్రి కృష్ణమోహన్, మాజేటి వెంకటసుబ్బయ్య శాస్త్రిలకు ఉగాది పురస్కారాలు అందించారు. అనంతరం కవి సమ్మేళనం నిర్వహించారు. చీరాల ప్రాంత కవులు ఉగాది ప్రాశస్త్యం గురించి కవితా గానం ఆలపించారు. వర్తమాన రాజకీయ అంశాలు, వివిధ పండుగల నేపథ్యం, సామాజిక సమస్యల ఇతివృత్తాలతో కవులు తమ కవితలను వినిపించి ఆహుతులను అలరింపచేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు బత్తుల బ్రహ్మారెడ్డి, కార్యదర్శి వదలి రాధాకృష్ణ, జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు తిమ్మన శ్యామసుందర్, ఏ.నాగవీరభద్రాచారి, పి.భానుచంద్రమూర్తి, వై.యల్లమందారెడ్డి పాల్గొన్నారు.